క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


ఎస్‌ఐ ప్రసాద్

బూర్జ: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బూర్జ ఎస్‌ఐ జీ.వి. ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విజయోత్సవ ర్యాలీలు, ఎదుట వ్యక్తులకు కించపరుస్తూ ప్రోగ్రామ్‌లు వంటివి నిర్వహించడానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ వేడుకలను తమ వ్యక్తిగత ప్రదేశాల్లోనే నిర్వహించుకోవాలన్నారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కల్పించవద్దని సూచించారు.

పాతపట్నంలో దుకాణాల మూసివేత


పాతపట్నం మార్కెట్‌లో మూసివేసి ఉన్న షాపులు

పాతపట్నం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉండటంతో పాతపట్నంలో మంగళవారం దుకాణాలను ఉదయం 10 గంటల తర్వాత పోలీసులు మూసివేయించారు. మెడికల్, కాయగూరలు దుకాణాలు మాత్రమే తెరిచి ఉంచారు. దుకాణాలు మూసివేయడంతో పాతపట్నం ప్రధాన రహదారి నిర్మానుష్యంగా కనిపించింది. సీఐ సాయితో పాటు ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ ప్రధాన కూడల్లో పోలీసు బందోబస్త్ నిర్వహించారు. ఆల్ ఆంధ్ర రోడ్డు, అంతరాబ కూడళ్లలో టీ దుకాణాలు, షాపులు మూసివేసినట్లు పోలీసులు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాతపట్నం: పుస్తకం పఠనంతో మనోవికాసం కలుగుతుందని పాతపట్నం శాఖా గ్రంథాలయాధికారి కాళ్ల రాజు అన్నారు. శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. చిన్నారులు విజ్ఞానంతో కూడిన ఆటలు ఆడాలన్నారు. ఉపాధ్యాయులు బి.బెనర్జీ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

సోంపేట: మండల కేంద్రం సోంపేట ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ మంగళవారం తెలిపారు. నడుపూరు శృతి, మాస్టీల శ్రీజ, జెర్రి సంజయ్‌లు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనవారిలో ఉన్నారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కంచమ్మతల్లికి పూజలు


కంచమ్మతల్లికి కొబ్బరికాయలతో మొక్కులు చెల్లిస్తున్న టీడీపీ నేతలు

కంచిలి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంపై మండల కేంద్రం కంచిలిలో టీడీపీ నాయగులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారికి 101 కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురళీమోహన్ పట్నాయక్, మాజీ సర్పంచ్ పైల పురుషోత్తం రెడ్డి, కొర్రాయి కురయ్య ఉన్నారు.

విజయగణపతికి విశేష పూజలు


పూజలందుకుంటున్న విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

టీడీపీ అభ్యర్థుల విజయం

ఆమదాలవలస/పాతపట్నం/నరసన్నపేట: ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాలకు సంభందించి ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం మంగళవారం ఉత్కంఠంగా కొనసాగింది. గత కొన్ని రోజులుగా ఎదురు చూస్తున్న ఫలితాలను ఎన్నికల నిర్వాహణ అధికారులు వెల్లడించారు. ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ తన ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంపై 33,183 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. లెక్కింపు ప్రారంభించిన మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు టీడీపీ అభ్యర్థి ఆధిక్యంలోనే కొనసాగారు. నరసన్నపేలో ధర్మాన కృష్ణదాస్‌పై బగ్గు రమణమూర్తి 29,971, పాతపట్నంలో రెడ్డి శాంతిపై మామిడి గోవిందరావు 25,238 ఓట్లతో గెలిపొందారు.

రౌండ్	వైఎస్సార్‌సీపీ (తమ్మినేని సీతారాం)	టీడీపీ (కూన రవికుమార్)	మెజార్టీ
01	2,682	4,902	2,220 (2220)
02	5,375	8,850	3,475 (1255)
03	8,494	15,057	6,563 (3088)
04	11,808	20,948	9,140 (2577)
05	15,395	26,756	11,361 (2221)
06	18,006	30,754	12,748 (1387)
07	20,870	35,789	14,919 (2171)
08	22,999	40,984	17,985 (3066)
09	25,419	45,965	20,546 (2561)
10	28,118	51,102	22,984 (2438)
11	30,854	55,471	24,612 (1633)
12	33,335	58,685	25,350 (733)
13	36,125	63,298	27,173 (1823)
14	38,899	66,811	27,912 (739)
15	42,658	71,485	28,827 (915)
16	45,414	75,127	29,713 (886)
17	48,278	79,566	31,288 (1575)
18	51,001	83,534	32,533 (1245)
19	51,938	85,121	33,183 (650)

నరసన్నపేటలో రౌండ్ల వారిగా కౌంటింగ్ సాగింది ఇలా..

రౌండ్	వైఎస్సార్‌సీపీ (ధర్మాన కృష్ణదాస్)	టీడీపీ (బగ్గు రమణమూర్తి)	మెజార్టీ
1	3,134	3,960	826
2	3,534	4,926	1,392
3	3,742	5,244	1,502
4	3,545	4,115	570
5	2,794	3,339	545
6	3,389	4,489	1,100
7	3,272	4,112	840
8	3,505	4,112	607
9	3,583	6,106	2,523
10	3,152	6,583	3,431
11	4,028	5,502	1,474
12	3,198	4,741	1,543
13	2,792	4,616	1,824
14	2,994	4,330	1,336
15	2,520	3,295	775
16	3,835	4,880	1,045
17	3,446	5,630	2,194
18	3,102	4,191	1,089
19	3,552	4,184	632
20	3,752	5,270	1,518
21	3,711	6,340	2,629
మొత్తం	70,580	99,951	29,371

పాతపట్నంతో రౌండ్లు వారీగా వివరాలు ఇలా ఉన్నాయి...

రౌండ్	వైఎస్సార్‌సీపీ (రెడ్డి శాంతి)	టీడీపీ (మామిడి గోవిందరావు)	మెజార్టీ
1	3,187	4,033	846
2	5,982	8,917	2,935
3	8,147	13,204	5,030
4	10,523	17,799	7,276
5	12,633	20,557	7,924
6	14,879	23,417	8,539
7	17,217	26,928	9,711
8	19,907	31,391	11,490
9	22,725	34,902	12,177
10	24,948	38,113	13,165
11	26,851	40,427	13,576
12	29,699	43,577	13,878
13	32,578	47,556	14,978
14	35,796	50,904	15,108
15	38,609	55,033	16,424
16	41,057	58,587	17,530
17	44,043	62,983	18,940
18	46,567	67,575	20,567
19	49,642	70,893	21,241
20	53,120	75,255	22,135
21	55,858	79,521	23,663
22	59,091	83,840	24,749
23	61,846	86,964	25,118
24	62,035	87,273	25,238

పోటెత్తిన భక్తులు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

పాతపట్నంలో వర్షం



పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుమలతో కూడిన వర్షం కురిసింది. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, బూరగాం, గంగువాడ, కొరసవాడ, రొంపివలస, ఆర్.ఎల్.పురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

కూటమి గెలుపు సంబరాలు


సారవకోట: గొర్రిబందలో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న టీడీపీ శ్రేణులు


పొందూరు: టీడీపీ కార్యాలయంలో సంబరాలు

పొందూరు: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీల నేతలు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాల నాయకులు పార్టీ కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను వీక్షించారు. కూన రవికుమార్ 19 రౌండ్‌ల తరువాత 33,285 ఓట్ల మెజార్టీతో గెలవడంతో బాణ సంచా కాల్చారు.

కొత్తూరులో..

కొత్తూరు: పాతపట్నం నియోజవర్గంలో 15 ఏళ్ల తరువాత టీడీపీ ఘనవిజయం సాధించింది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు ఎమ్మెల్యేగా విజయంసాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. 2009లో మాజీ మంత్రి విజయరామరాజు పాతపట్నం నియోజవర్గం నుంచి గెలుపొందారు. 2014లో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ వైఎస్సార్‌సీపీ నుంచి విజయం సాధించారు. 2019లో రెడ్డి శాంతి వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపొందారు.

సారవకోటలో..

సారవకోట: ఎన్నికల ఫలితాలలో నరసన్నపేట నుంచి టీడీపీ విజయం సాధించడంతో మండలంలో టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. గొర్రిబందలోని అమ్మవారి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడుని మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: నరసన్నపేట నుంచి టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఐదేళ్ల క్రితం ఓటమి చెందిన బగ్గు రమణమూర్తి ఈ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించడంతో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు స్వీట్లు పంచుకుని సందడి చేశారు. నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటతో పాటు జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో టీడీపీ శ్రేణులు, నరసన్నపేట పట్టణంలో కార్యకర్తలు బాణ సంచా కాల్చారు.

నరసన్నపేట నియోజకవర్గంలో అభ్యర్థులకు పోలైన ఓట్లు

అభ్యర్థులు	పార్టీ	పోలైన ఓట్లు
ధర్మాన కృష్ణదాస్	వైఎస్సార్‌సీపీ	70,580
బి.రమణమూర్తి	టీడీపీ	99,951
మంత్రి నర్సింహమూర్తి	కాంగ్రెస్	2,225
కాయ కామేశ్వరి	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	432
చీపురు రవి	జై భారత్ పార్టీ	265
బోర వెంకట సత్యేంద్రనాథ్ అభిషేక్	ఇండిపెండెంట్	332
మైలపల్లి జగదీష్	పిరమిడ్ పార్టీ	291
నోటా	నోటా	3,300

ఇది ప్రజా విజయం

నరసన్నపేట: ఇది ప్రజలిచ్చిన విజయం, నా గెలుపు ఖాయమని ముందే ఊహించాను, ఇంత భారీ మెజార్టీతో గెలిపిస్తారని అనుకోలేదని నరసన్నపేట టీడీపీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. విజయం అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకసారి ఎమ్మెల్యేగా చేసిన అనుభవం ఉంది. దీంతో రానున్న ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తా.. ప్రధానంగా ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు అనేక హామీలు ఇచ్చాను వాటిని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాను. ప్రధానంగా బొంతు ఎత్తిపోతల పథకాన్ని వీలున్నంత తొందరగా పూర్తి చేయిస్తాను. నరసన్నపేట టౌన్‌లో అసంపూర్తిగా ఉండిపోయిన భూగర్భ డ్రైనేజీ స్థితిగతులు పరిశీలించి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని రమణమూర్తి అన్నారు.

భద్రమ్మ తల్లి ఆలయంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ భద్రమ్మతల్లి దేవాలయంలో మంగళవారం ప్రేత్యక పూజలు నిర్వహించారు. సేవకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ముర్రాట్లు సమర్పించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో భద్రమ్మతల్లి

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు


సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్ : బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు.

రాయితీపై వరి విత్తనాలు


ఏపీ సీడ్స్ గొడౌన్‌లో ఉన్న వరి విత్తనాలు

- 1380 క్వింటాళ్ల పంపిణీకి ముందస్తు ప్రణాళిక
- రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేత

గార : ఖరీఫ్ సీజన్‌కు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే గార మండలంలో వరి పంట సాగు కోసం భూములు దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. మండల రైతాంగానికి వివిధ రకాలైన విత్తనాలు 1380 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు చేశారు. ఇంకా అవసరమైన వాటిని రైతాంగానికి ఇచ్చేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక చేసింది. సాంబమసూరి, శ్రీకాకుళం సన్నాలు, మార్టేరు 7029 (స్వర్ణ), ఇంద్ర వంటి రకాలు పంపిణీ చేయనున్నారు. వీటిపై కేజీ విత్తనాలకు రూ.10 రాయితీ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఏపీ సీడ్స్ గొడౌన్‌లో విత్తనాలు అందుబాటులో ఉంచనున్నారు. త్వరలోనే రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించనున్నామని అధికారులు చెబుతున్నారు. అనంతరం ఆర్బీకేల వద్దనే రైతులకు విత్తనాలు అందించనున్నారు. ఇప్పటికే మండలంలో రైతుల కోసం 70 క్వింటాళ్ల జీలుగు, 30 క్వింటాళ్ల కట్టెజనుము విత్తనాలను 50 శాతం రాయితీపై ఆర్బీకేల వద్ద పంపిణీ చేస్తున్నారు.

కౌంటింగ్ ఎఫెక్ట్



నిర్మానుష్యంగా ఉన్న టెక్కలిలోని వైఎస్సార్ జంక్షన్

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రభావంతో మంగళవారం టెక్కలిలో పలు ప్రధాన జంక్షన్‌లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు జిల్లా కేంద్రంలోని శివానీ కళాశాల లెక్కింపు కేంద్రానికి చేరుకోగా, మరి కొంతమంది ఇళ్లల్లో టీవీలకు అతుక్కుపోయారు. పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేయడంతో పట్టణంలో ప్రధాన జంక్షన్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురానికి నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు సోమవారం నుంచి ప్రారంభమైంది. ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు పార్వతీపురం నుంచి బయలుదేరే బస్సు రాత్రి 9.45 గంటలకు గుమ్మలక్ష్మీపురం చేరుకుంటుంది. ఆ రాత్రి ఆ బస్సు అక్కడే ఉండి మరుసటిరోజు ఉదయం 5.20 గంటలకు పార్వతీపురం బయలుదేరివెళ్తుంది. ఈ అవకాశాన్ని స్థానికులు, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు ప్రజలను కోరారు.

రిమ్స్ అన్నదాన పథకానికి విరాళం


విరాళం అందిస్తున్న భోజ్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో అమలవుతున్న అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి హయాతినగరానికి చెందిన కిల్లాన భోజ్‌కుమార్ తన కుమారుడు పెళ్లి రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం మంగళవారం అందించారు. ఈ విరాళాన్ని సంఘం కార్యదర్శి ఫల్గుణరావుకు అందించారని సంఘ అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు

- నోటాకే అధిక ఓట్లు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన కాంగ్రెస్, బీఎస్పీ, బీసీవైపీ, స్వతంత్ర అభ్యర్థుల కంటే నోటాకే అధిక ఓట్లు పోలయ్యాయి. 4,345 ఓట్లు నోటాకు పోలవ్వగా, వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీటీసీగా గెలుపొందిన మాసుపత్రి చక్రవర్తిరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయనకు 760 ఓట్లు పోలయ్యాయి. అలాగే బెంతు ఒరియా సామాజిక వర్గానికి చెందిన వేదవర బిసాయి బహుజన సమాజ్ పార్టీ తరపున పోటీ చేసి 625 ఓట్లు, బీసీవై పార్టీ తరపున పోటీ చేసిన బడ్డి ముఖలింగానికి 165 ఓట్లు, జైభీమ్‌రావ్ పార్టీ తరపున పోటీ చేసిన లాభాల విశ్వనాథానికి 161 ఓట్లు, రైతు కుల సంఘం తరపున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన జన్నెల సూర్యవరప్రసాదరావుకు 736 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మురపాల లక్ష్మికి 211, మరో స్వతంత్రం అభ్యర్థి సుగ్గు చక్రవర్తిరెడ్డికు 279 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 4,345 ఓట్లు పోలవ్వగా, స్వతంత్ర అభ్యర్థులకు మొత్తం కలిపి 2,939 ఓట్లు పోలయ్యాయి.

ఊరేగింపులు నిర్వహిస్తే చర్యలు


సింగిడి కూడలిలో పర్యటిస్తున్న ఎస్సై ప్రసాద్, సిబ్బంది

భామిని: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని బత్తిలి ఎస్సై చేకూరి ప్రసాద్ అన్నారు. మండలంలోని బత్తిలి, గురండి, సింగిడి, భామిని గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద మంగళవారం పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, పోస్టులు చేయవద్దని ప్రజలకు సూచించారు. గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలన్నారు. అనవసర వివాదాలకు తావివ్వొద్దని కోరారు.